
## ప్రవహిస్తున్న వరద..ఆలయం మూసివేత

### -రాజగోపుంలో ఉత్సవ విగ్రహానికి పూజలు

**పాపన్నపేట, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ముందు నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో అమ్మవారి ప్రధాన ఆలయంను అధికారులు మూసివేశారు. సింగూరు ప్రాజెక్టు నుంచి 13వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో అమ్మవారి ఆలయం ముందు వరద ప్రవాహం పెరిగిపోయింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని ఆలయ గోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజా కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం ముందు నుంచి వరద ప్రవాహం అధికం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుర్గమ్మ ఆలయంను మూసిసి రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించడం, భక్తులు అక్కడే అమ్మవారిని దర్శించుకుంటున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## ఇంటర్ విద్యార్థి అదృశ్యం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

ఇంట్లోకి కూరగాయలు తెస్తానని చెప్పి వెళ్లిన ఇంటర్ విద్యార్థి కనబడకుండా పోయిన సంఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు... తండాకు చెందిన కట్రోత్ లక్ష్మి, రాజులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కట్రోత్ దేవేందర్, కట్రోత్ సింహాద్రిలు ఉన్నారు. పెద్దకుమారుడు కట్రోత్ దేవేందర్(17) నర్సాపూర్‌లోని గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం చేగుంటాలో కూరగాయలు తేవడానికి వెల్లున్నాని చెప్పి వెళ్లిన దేవేందర్ అర్ధరాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన కుటుంబసభ్యులు బందువులు, చుట్టూ పరిసర ప్రాంతాలలో వెతికిన ఆచూకి దోరకలేదు. తల్లి కట్రోత్ లక్ష్మి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మిజోరం గవర్నర్ హరిబాబు

## రూ. 690 కోట్లతో అన్ని రాష్ట్రాలకు రైలు సౌకర్యం

### మిజోరం గవర్నర్ హరిబాబు

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఈశాన్య రాష్ట్రాల్లో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదికి అత్యంత ప్రాధాన్యత ఉంటుందని మిజోరం గవర్నర్ హరిబాబు అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో బిజెపి నాయకురాలు గోదావరి అంజిరెడ్డి నివాసం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో చర్చల ఫలితం గానే 1986లో మిజో నేషనల్ ఫ్రంట్ జనజీవనంలోకి వచ్చిందని గుర్తు చేశారు. భారత దేశంలోని చాలా రాష్ట్రాలకు రైల్వే సౌకర్యం లేదని, 690 కోట్ల రూపాయలతో అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రైలు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. 13లక్షల జనాభా ఉన్న మిజోరంలో 2023 నాటికి రైలు కూత వినబడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా బర్మాకు నీటి ద్వార ప్రయాణ సౌకర్యం ఏర్పడుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ను రైతులు అధికంగా పండిస్తున్నారన్నారు. వర్షాధార పంటలతో రైతులు తృప్తిపడుతున్నారన్నారు. గవర్నర్ వ్యవస్థ రాజ్యాంగబద్ధమైందని వివరించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల యువతచే సంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు తన వంతు సిఫారసు చేస్తానని హామి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఐలమ్మ స్పూర్తితో హక్కుల కోసం పోరాడుదాం

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

చాకలి ఐలమ్మ ఉద్యమ స్పూర్తితో హక్కుల కోసం పోరాడుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్లో చాకలి ఐలమ్మ వర్ధంతిని సిఐటియు సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, దోపడిడీ, పీడన నుంచి విముక్తి కోసం జరిగిన ఆనాటి సాయిధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను చాకలి ఐలమ్మ గడగడలాడించిందని గుర్తు చేశారు. ఆమె పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. నిరంకుశ నియంతృత్వానికి ఎదురు తిరిగి పోరాడిందని కొనియాడారు. ఆమె స్పూర్తితో హక్కుల కోసం ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరం మల్లేశం, జి సాయిలు, ఉపాధ్యక్షులు కె రాజయ్య, నాయకులు అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుకుంటూ వంట పాత్రలో పడిన చిన్నారి

### -హైద్రాబాద్ ఆస్పత్రికి తరలింపు

**కంది, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్న తరరుణంలో ఓ చిన్నారి ఆడుకుంటూ వండిన వంట పాత్రలో పడ్డ సంఘటన మండలంలోని చెర్లగూడెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు,కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుండగా గ్రామానికి చెందిన మాశెట్టి నర్సింలు, లలితలు తమ కుటుంబ సభ్యులతో కలిసి భోజనానికి వెళ్లారు. తమ 3 సంవత్సరాల చిన్నారిని దించగా చిన్నారి ఆడుకుంటూ పాత్రలో నిల్వ ఉంచిన కూరగాయల్లో పడిపోయింది. ప్రమాదంలో బాలిక శరీరం కాలిపోగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డిలో ప్రథమ చికిత్స అందుకుని మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ ఆస్పత్రికి తరలించారు. నర్సింలు కుటుంబ పేదలు కావడంతో చికిత్స కోసం కంది మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నసాయి శ్రీరామ్ తన వంతుగా 10వేల రూపాయలు అందించి, ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందేలా డిసిసి అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డితో ఫోన్‌లో డాక్టర్లకు సూచించేలా రామ్ చర్యలు తీసుకున్నారు.

## ఎద్దుమైలారంలో రూ.2.51లక్షలకు లడ్డు వేలం

### -లడ్డును దక్కించుకున్న ఎంపిటిసి ఫోరం జిల్లా అధ్యక్షులు

**కంది, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసాయి. ఆయావినాయక మండపాల వద్ద నిర్వహించిన లడ్డుల వేలంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని గణనాథుల చేతుల్లో ఉండి ప్రత్యేక పూజలు అందుకున్న లడ్డులను దక్కించుకున్నారు. మండలంలోని ఎద్దుమైలారం గ్రామంలో నిర్వహించిన లడ్డువేలంలో ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు వరకుమార్ 2లక్షల 50వేల రూపాయల వేలం పలికి లడ్డును సొంత చేసుకున్నారు. లడ్డును ఉత్సవ కమిటి నిర్వాహకులు వరకుమార్‌కు అందించారు.

## డాకూరులో నిరాహార దీక్ష భగ్నం చేసిన పోలీసులు

**జోగిపేట,సెప్టెంబర్10,ప్రభాతవార్త:** నిజమైన అర్హులకు డబుల్ బెడ్రూంలను అందచేయాలంటూ మండల పరిధిలోని డాకూరులో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. శనివారంనాడు మధ్యాహ్నం జోగిపేట ఎస్ఐ సామ్యానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు నిరాహార దీక్ష చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల వద్దకు చేరుకుని, దీక్ష విరమించాలని నిరాహారదీక్ష చేస్తున్న నాయకులను కోరారు. తమకు అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు దీక్ష విరమించేది లేదని మొండికేశారు. కాగా ప్రస్తుతం పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఎలాంటి దీక్షలకు అనుమతి లేదని ఎస్ఐ వారికి వివరించి, మీరు ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలంటూ దీక్ష చేస్తున్నవారికి అరెస్ట్ చేసి జోగిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వచం పూచీకత్తుతో వారిని వదిలిపెట్టారు. అరెస్టయినవారిలో డాకూరు మాజీ సర్పంచు రమేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మెన్ నరెందర్‌రెడ్డి, ఎంపిటిసి ప్రవీన్‌కుమార్, దళిత సంఘాల నాయకులు మల్లేశం, పద్మారావు తదితరులు ఉన్నారు.

## కమ్యూనిటీహాల్‌కు రూ.కోటి 45 లక్షలు మంజూరు

### ప్రొసిడింగ్ కాపీ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):** సూర్యవంశ ఆరెకటిక సంఘం కమ్యూనిటీహాల్ భవనం నిర్మాణం కొరకు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రూ.కోటి 45 లక్షలు మంజూరు చేస్తూ శనివారం ఆయన నివాసంలో సంఘం నాయకులకు ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకటిక సంఘం నాయకుడు కళ్యాణ్‌కార్ నర్సింగరావు మాట్లాడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి మాటల ద్వారా స్వర్గాన్ని చూపెట్టే పార్టీలు ఉన్న రోజుల్లో టిఆర్ఎస్ పార్టీ మాత్రమే ప్రతి వర్గాన్ని అక్కున చేర్చుకొని న్యాయం చేస్తుందన్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్చం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్‌కార్ రమేష్, జమాల్‌పూర్ శ్రీనివాస్, జమాల్‌పూర్ ప్రశాంత్, ప్రదీప్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ముందంజ

- పేదలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు బాగున్నాయి
- పల్లె ప్రకృతి ఫారెస్ట్ పనులు భేష్
- ఉత్తరప్రదేశ్ ఫారెస్టు క్లైమేట్ శాఖ మంత్రి డాక్టర్ అరుణ్‌కుమార్

**ములుగు, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేస్తున్న అభివృద్ధి పనులు బాగున్నాయని ఉత్తరప్రదేశ్ ఫారెస్టు క్లైమెట్ శాఖ మంత్రి డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం జప్తిసింగాయిపల్లి, ములుగు, నర్సంపల్లి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పల్లె ప్రకృతితో పాటు ఫారెస్టులో పనితీరు కూడా బాగున్నాయన్నారు. ఇక్కడ పేదలకు కూడా అనేక సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం బాగా పనిచేస్తుందన్నారు. విస్తారంగా వర్షాలు పడితే భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశ్యంతో సిఎం కెసిఆర్ హరితహారంలో భాగంగా అడవుల పెంపకం, రోడ్లకు ఇరువైపులా చెట్లను పెంచడం, గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడం చాలా బాగుందన్నారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు చాలా అద్భుతంగా ఉన్నాయని ఆయన కొనియాడారు. అలాగే నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణం కూడా బాగున్నాయని, పేదలకు ఇల్లు ఒక వరం అని అన్నారు. ఆయన వెంట సిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, ఆర్‌సి శోభ, డిఎఫ్ఓ శ్రీధర్‌రావు, ఎఫ్ఆర్ఓ కిరణ్‌కుమార్, ములుగు ఎంపిడిఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపిపి ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి,గ్రామ సర్పంచ్ కొండల్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు బాపురెడ్డి, పంచాయతీ కార్యదర్శి దీప్తితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న యుపి మంత్రి అరుణ్‌కుమార్

# పటాన్‌చెరువు మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

### రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావు

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** పటాన్‌చెరువు మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖా మాత్యులు తన్నీరు హరీష్‌రావు అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామికవాడ నుంచి కర్ధనూరు జంక్షన్ వరకు 121కోట్ల రూపాయలతో నాలుగు రోడ్ల బీటీ రహదారికి, రుద్రారం సిద్ది గణపతి దేవాలయం అవరణలో 4కోట్ల 50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. పటాన్‌చెరువు వ్యవసాయ మార్కెట్ కమిటి బాధ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ పటాన్‌చెరువులో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల శంకుస్థాపనకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరవుతున్నట్లు మంత్రి ప్రకటించారు. రుద్రారం గణపతి దేవాలయ ప్రాంగణంలో 4 కోట్ల 50 లక్షలతో మూడు రాజ గోపురాలు, నిత్య అన్నదాన సత్రం, కళ్యాణ మండపం, 24 దుకాణ సముదాయల నిర్మాణం పనులు పూర్తయితే ఆలయం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటి ఏర్పాటుకు 14 ఎకరాల భూమిని కేటాయించాలని గతంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తేగా అదే రోజు భూమిని కేటాయించారని మంత్రి గుర్తు చేశారు. హైద్రాబాద్‌లోని మలక్‌పేట ఉల్లిగడ్డ మార్కెట్‌ను పటాన్‌చెరువుకు తరలించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటి చైర్మన్ విజయకుమార్ మార్కెట్ అభివృద్ధికి కృషి సల్పాలన్నారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామక వాడగా పేరున్న పాశమైలారం పారిశ్రామికవాడ పరిశ్రమలకు, కార్మికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకే 121 కోట్లతో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.

సమిష్టి సహకారంతోనే పటాన్‌చెరువు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పడేలా చర్యలు తీసుకుంటున్నామని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి హరీష్‌రావును భారీ కాన్వాయితో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, టిఎస్ ఆర్‌డిసి ఎండి మెట్టు శ్రీనివాస్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, శాసన మండలి మాజీ చైర్మన్ వి భూపాల్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావు దృశ్యం

# నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సమాజంలో మార్పు రావాలన్న..నవ సమాజం నిర్మాణం కావాలన్నా ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మలు అన్నారు. సిద్దిపేట లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో అచార్యదేవోభవ పేరుతో జిల్లాలోని 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, మెమోంటోలు, అభినందన పత్రంతో జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. చదువుతోనే అన్ని అంశాలు ముడిపడి ఉంటాయని అస్తులు, అంతస్తులు కాదని విజ్ఞానవంతుడైతే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. ఏ ప్రాంతమైతే చదువులో ముందుంటుందో అ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు. సమాజంలో అందరూ సమానంగా తయారు కావాలంటే ప్రతి ఒక్కరూ చదువులో సమాన స్థాయి సాధించాలని అందు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్య, వైద్యం సమానంగా ఉచితంగా అందితే అభివృద్ధి సాధించడం సులభమన్నారు. మంత్రి హరీష్‌రావు కృషితో విద్య, వైద్యం అందరికి అందేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లా విద్యారంగంలో ప్రథమ స్థానంలో నిలుపడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. లయన్స్‌క్లబ్ ఉచితంగా అనేక సేవ కార్యక్రమాలను చేస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తుందాన్నరు. మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు, లయన్స్ ప్రతినిధులు బాబురావు, ఏ.అమరనాథరావు, జ్యోతి, నారాయణ, నాగరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వినోద్‌మోదాని, గంప రమేష్, రవి, కొమురవెల్లి శేఖర్, జిల్లా జోగయ్య, భాస్కర్‌రెడ్డి, సురేష్‌కుమార్, రాముని భాస్కర్, లశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, సుభాష్ పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, లయన్స్‌క్లబ్ నాయకులు

## కనుమరుగవుతున్న సమాచార హక్కు చట్టం

### -ఉద్యమకారులు యండి నిజామొద్దీన్ రషీద్

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టాన్ని అధికారులు, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అటకెక్కిస్తున్నారని సమాచార హక్కు చట్టం ఉద్యమకారులు, ప్రముఖ న్యాయవాది మొహమ్మద్ నిజామద్దీన్ రషీద్ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని అతిథి గృహంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామొద్దీన్ రషీద్ మాట్లాడుతూ చట్టం ఏర్పాటు చేసి 17 సంవత్సరాలు గడుస్తున్నా చట్టం సక్రమంగా అమలు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమాచారక కమీషనర్లు కొందరు హేరింగ్‌ల ధరఖాస్తు దారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధాకారులు చట్టం అమలుకు ప్రత్యేక శ్రద్ద వహించాలని హితులు పలికారు. కార్యక్రమంలో నాయవాది యాదయ్య, చట్టం ఉద్యమకారులు శ్రీనివాస, మల్లేశం, కృష్ణారావు, ప్రకాశ్‌గౌడ్, రాజమల్లేశ్, మురాహరి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## శాంతి సామరస్యాలకు ప్రతీక జహీరాబాద్

### -ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

**జహీరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** జహీరాబాద్ ప్రాంతం శాంతి సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అభిప్రాయ పడ్డారు. శుక్రవారం రాత్రికి జహీరాబాద్ పట్టణంలో గణేశ నిమర్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని సార్వ జనిక్ గణేశ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంత ప్రజలు కులమతాలకు అతీతంగా ఒకరి పండగల్లో మరొకరు పాల్గొని ఆనందోత్సవాలతో జరుపుకుంటారని గుర్తు చేశారు. ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉంటే సమాజం మంచిమార్గంలో పయనిస్తుందని, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్లు మంకాల్ సుభాష్, అల్లాడి నర్సింలు, బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

**తొగుట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :**

తొగుట రాంపూర్ సంక్షేమ గురుకుల హాస్టల్‌లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్వచ్ఛ గురుకుల ప్రోగ్రామ్‌లో శనివారం పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఎంచుకున్న గోల్‌కు దగ్గర కావాలంటే ఇప్పటీ నుంచే అడుగులు వేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటలో వినాయక నిమజ్జనం రోజు చనిపోయిన బాలకిషన్ కుటుంబీకులను ఎమ్మెల్యే రఘు నందన్‌రావు పరామర్శించారు. బాలకిషన్ సోదరి చదువుల కోసం తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. గోవర్ధనగిరి బాపిరెడ్డి తల్లి మరణించిన విషయం తెలుసుకుని కుటుంబీకులను అయన పరామర్శించారు. అయా కార్యక్రమాలలో రెడ్డి లక్ష్మాపూర్ పార్టీ నాయకులు విభీషన్‌రెడ్డి, తోలుకంటి రాజు, నరసింహారెడ్డి, శ్రీనివాస్, గణేష్, అంజనేయులు, కొమ్ము కర్ణాకర్, దాసరి కళ్యాణ్‌దాస్, శ్రవణ్‌రెడ్డి, నంట స్వామిరెడ్డి ఉన్నారు.

## లైంగిక వేధింపులు, గృహ హింసకు గురికాకుండా ఉండాలి

### మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో మనఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఇండ్లల్లో పనిచేస్తున్న గృహ కార్మికులను గుర్తించి వారి హక్కులను కాపాడుకునేందుకు గృహ కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సంఘాల గృహహింస, పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నుండి రక్షణ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ అవగాహనా కార్యక్రమానికి మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మీరు పనిప్రదేశాలలో లైంగిక వేధింపులకు, గృహ హింసకు గురికాకుండా ఉండాలంటే మీకు చట్టాలపై అవగాహక కలిగి ఉండాలని చట్టాలను తెలుసుకొని గ్రూపు సభ్యులందరికి తెలియజేయాలని అన్నారు. అనంతరం చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ ఏం ఏ ముజీబ్ మాట్లాడుతూ గృహ కార్మికులందరూ వారి హక్కులను కాపాడుకునేందుకు మీరందరు మీ తోటి వారితో కలసికట్టుగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్వాన్ కో-ఆర్డినేటర్ స్వప్న, చిల్డ్‌లైన్ టీం మెంబర్స్ 80 మంది, గృహకార్మిక సంఘాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

## సిపిఎస్ విధానం రద్దు చేయాలి

### టీఎస్‌యుటిఎఫ్ డిమాండ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

నూతన విద్యా విధానం (ఎన్ఈపి) 2020 ని రద్దు చేయాలని, ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని రూపొందించాలని, సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రపతికి కోటి సంతకాల సేకరణతో మెమోరండం సమర్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం సంగారెడ్డి పట్టణంలోని మైనార్టీ రెడిడెన్షియల్, మహాత్మాజ్యోతిరావుపూలే రెసిడిఎన్షియల్ పాఠశాలల ను సందర్శించి ఉపాధ్యాయులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు కె అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి సాయిలు మాట్లాడుతూ నూతన విద్యా విధానం వల్ల విద్యార్థుల డ్రాప్ అవుట్ పెరిగే ప్రమాదం ఉందని, డిటెన్షన్ పాలసీ తిరిగి రావడంతో పేద పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి సాయితేజ, చందర్ రాథోడ్, నాయకులు విజయనంద్, సింహాచలం, జగన్ మోహన్ అయా రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్లు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుండంలో పడి డిగ్రీ విద్యార్థిని మృతి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** డిగ్రీలో విద్యను అందుకుంటున్న విద్యార్థిని గుండంలో పడి మృతి చెందిన సంఘటన శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పట్టణంలోని రాజంపేటకు చెందిన డిగ్రీ విద్యార్థిని ముస్కాన్‌బేగం (20) ఉదయం ప్రమాదావశాస్తు గుండంలో పడి మృతి చెందిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పురాతనమైన గుండంను ఈ మధ్యకాలంలో పునుద్దరణ పనులు చేయించారు. అయితే గుండం చుట్టూ ప్రహారీ గోడను నిర్మించకపోవడంతో తరుచూ ప్రదామాలు చోటు చేసుకుంటున్నాయని కాలనీ వాసులు చర్చించుకుంటున్నారు. గుండం పక్కనే చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు ఆట పరికాలను సైతం ఏర్పాటు చేశారు కాని ప్రహారి గోడను నిర్మించడంలో సఫలం కాలేకపోయారు. ఈ ప్రాంతం గుండా సంచరించే ప్రజలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

## బిల్కిస్ భానో నిందితుల విడుదల దురదృష్టకరం

### -ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ అజీజ్

**జహీరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** బిల్కిస్ భానోను గుజరాత్ గోద్ర అల్లర్లలో 2002లో సామూహిక అత్యాచారానికి గురై హత్య చేసిన నిందితులను సత్రవర్దన కింద విడుదల చేయడం అత్యంత దురదృష్టకరమని తెలంగాణ రాష్ట్రమూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ కమిటి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ విచారం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ఇస్లామిక్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అజీజ్ మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం, హత్యతో పాటు 11 మంది కుటుంబ సభ్యులను హత్య చేసిన వారు మంచిగా ఎలా మారుతారని ప్రశ్నించారు. అనేకుల మరణానికి కారకులైన విడుదలైన నిందులను వెంటనే గుజరాత్ ప్రభుత్వం తిరగి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజలకు అందుతున్న ఆయా పథకాల్లో అవినీతి రాజ్యమేలుతోందని, దళారులు దండిగా దండుకుంటున్నారని మండిపడ్డారు. ఎంపీజే కమిటి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అవినీతిని అరికట్టేందుకు ఉమ్మడి రాష్ట్రాల్లో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఎంపీజేకు రాజకీయ సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీజే అధ్యక్షులు ఎండిఆయూబ్ ఆహ్మద్, డిక్కి జిల్లా ఇంచార్జి ఎల్ జనార్ధన్, నాయకులు నసీరుద్దీన్, సత్తార్ అలీ, ఎజాజ్ పాషా,యాసర్ ఖాన్, ఖలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీసి రోగులకు పండ్లు పంపిణి చేశారు.

## కొత్తపల్లికి నిలిచిపోయిన రాకపోకలు

**పాపన్నపేట, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొత్తపల్లి-యూసుఫ్‌పేట గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లింక్ రోడ్డు వరద నీటితో మునిగిపోవడంతో రాకపోకలు ఆగిపోయాయి. శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి దారులు బురదయంగా మారిపోయాయి. మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై రాక పోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణీకులు అన్నారం మీదుగా నార్సింగివైపు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. బొడ్మట్‌పల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను నార్సింగి నుంచి యెనే కొత్తపల్లి మీదుగా మెదక్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది.

## కొండపాకలో చాకలి ఐలమ్మ వర్ధంతి

**కొండపాక, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

పోరాట స్పూర్థిని ప్రపంచానికి చాటిన తెలంగాణ వీరవనిత, నిప్పు కనిక చాకలి ఐలమ్మఅని సర ్పంచ్ అరెపల్లి మహదేవ్ అన్నారు. శనివారం దుద్దెడలో ఆమె వర్ధంతిని ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం భూస్వాములతో పోరాడిన గొప్ప వీరవనిత ఐలమ్మ అన్నారు. తెలంగాణ గడ్డమిద ఆమేపేరు స్థిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆమె ధైర్యానికి, పోరాటపటిమాకు జోహార్లు అర్పిస్తునమన్నారు. అదే విధంగా దుద్దెడ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంపిటీసీ గురజాడ బాలాజీ, ఉప సర ్పంచ్ గుండెల్లి అంజనేయులు, పిల్లి నాగులు, దోమల ఎల్లం, గ్రామస్తులు ఉన్నారు.

## సాగునీటి కాల్వల మరమ్మతు పనులు చేపట్టాలి: ఎంపిపి



కాచవాని సింగారంలో సాగునీటి కాల్వకత్వాలను పరిశీలిస్తున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మండలంలోని కాచవాని సింగారంలో సాగునీటి కాల్వలపై ఉన్న కత్వాలు తెగిపోయిన పట్టించుకునే వారే కరువయ్యారని ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారంలో శనివారం ఎంపీపీ, స్థానికన నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామంలోని చౌదరి కత్వా వెంబడి పర్యటించి సాగునీటి కాలువ స్థితిగతులను పరిశీలించారు. కత్వాపై ఉన్న పై కప్పులతో పాటు కాలువలకు గండ్లు పడిన, కాల్వలో కురుకుపోయిన మట్టిని, ముళ్ల పొదలను తొలగించేవారే లేరని ప్రభుత్వానికి ఎన్ని మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. మూసీనది శుద్ధీకరణతో పాటు నీటిని తాగేవిధంగా శద్ధీ చేస్తామని అందుకుగాను వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్లు టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందే తప్పా ఎక్కడ అమలు చేసినా పాపానా పోలేదని అన్నారు. ఇకనైన ప్రభుత్వం స్పందించి ఘట్‌కేసర్ మండలంలోని సాగునీటి కాల్వల మరమ్మత్తు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, వార్డు సభ్యురాలు మట్ట లలిత స్థానిక నాయకులు ప్రభంజన్ గౌడ్, బస్వరాజ్ గౌడ్, రత్నాకర్, కోటగిరి ప్రవీణ్, వర్కల శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.4లక్షలు పలికిన రాళ్లగూడ వినాయకుడి లడ్డు



లడ్డును కైవసం చేసుకున్న మాదిరెడ్డి శివారెడ్డి

**శంషాబాద్ సెప్టెంబర్10,ప్రభాతవార్త :** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడ రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను చిన్న మాదిరెడ్డి శివారెడ్డి నాలుగు లక్షల ఒక వెయ్యి రూపాయలకు సొంతం చేసుకున్నాడు.హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద నవరాత్రి పూజల అనంతరం వినాయకుడి లడ్డూను వేలం వేశారు.వేలం పాటలో పలువురు భక్తులు లడ్డు కోసం పోటీ పడగా నాలుగు లక్షల ఒక వెయ్యి రూపాయలకు శివారెడ్డి స్వాధీనం చేసుకున్నారు.అనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు ఎం.వెంకట్రాంరెడ్డి,కూడా ఎస్ శ్రీనివాస్ రెడ్డి,ఎం.జగన్ మోహన్ రెడ్డి,ఎస్ జంగారెడ్డి,ప్రదీప్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,నరేందర్ రెడ్డి,హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.లడ్డును గత కొన్ని సంవత్సరాలుగా వరుసగా స్వంతం చేసుకుంటున్న శివారెడ్డిని పలువురు అభినందించారు.

## సామూహిక శ్రీమంతాలు... అక్షరాభ్యాసాలు



**శంషాబాద్ సెప్టెంబర్10,ప్రభాతవార్త :** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం అన్నప్రాసన కార్యక్రమాలను మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ దంపతులు నిర్వహించారు.తన వార్డు పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని బండి గోపాల్ యాదవ్ పేర్కొన్నారు.పలువురు మహిళలకు చీర సారే పెట్టి సామూహిక శ్రీమంతాలు నిర్వహించగా చిన్నారి బాలబాలి కలకు అన్న ప్రాసన అక్షరాభ్యాసాన్ని ఘనంగా చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**తలకొండపల్లి సెప్టెంబర్10,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో నిర్వహించిన వినాయక పూజలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శనివారం చీపునుంతల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న తర్వాత లడ్డు వేలం పాటలో పాల్గొన్న భక్తుడిని ప్రత్యేకంగా సన్మానించారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామ ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉంటే గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.దైవభక్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, బాల కుమార్,జగన్ రెడ్డి,అది సర్పంచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

**షాబాద్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని షాబాద్ ఇన్స్పెక్టర్ ఆశోక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గల మహేశ్వరం గురుకుల పాఠశాలలో ఈ నెల 11 వరకు స్వచ్ఛ గు రుకులం వారోత్సవాల్లో భాగంగా మహేశ్వరం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, షాబాద్ సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరీలతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ నరేందర్, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.



షాబాద్‌లో గురుకులంలో మొక్కలు నాటుతున్న ఇన్స్పెక్టర్ ఆశోక్

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: మంత్రి

### -వైద్య పరికరాల సరఫరా..24 గంటల సేవలకు నిర్ణయం



ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్.మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం కమిటీ సమావేశం శనివారం స్థానిక ఎమ్మెల్యే-మంత్రి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కమిటీ సభ్యులు పలు అంశాలపై చర్చించి అవసరమైన తీర్మాణాలు చేశారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు, ఓపిడి, ఐపిడి రోగుల వైద్య సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు, వ్యాధి నివారణ, టీకా కార్యక్రమాలు, నిధుల వినియోగం, పరికరాలు, మందుల సరఫరా తదితర అంశాలపై చర్చించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపించామని, డాక్టర్ల కొరత లేకుండా చూస్తామని మంత్రి తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటల పాటు చికిత్స అందాలని అర్థరాత్రి అత్యవసర సమయంలో వచ్చే గర్భి ణీలకు ఇక్కడే కాన్పులు చేయాలని, వివిధ పరీక్షల కోసం రోగులకు బయటకు పంపకూడదని పరికరాలకు మరమ్మత్తు పనులు చేపట్టాలని కమిటీ తీర్మాణం చేసింది. మూడు నెలలకు ఒక సారి జరగాల్సిన కమిటీ సమావేశం కోవిడ్ కారణంగా సంవత్సరం తర్వాత నిర్వహించారు. మంత్రి వెంట అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు రావడంతో స్థలం లేక అధికారులు కూడా సమావేశం బయటనే ఉండిపోయారు. కమిటీ సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా కొందరు అనధికారికంగా మంత్రి వెంట ఉన్నారు. ఈసమావేశంలో మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ పూస వెంకటేశ్, డిఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ నారాయణరావు, ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.కోట్యానాయక్, మున్సిపల్ కమీషనర్ ఎన్. వసంత, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ వార్డుసభ్యురాలు అబ్బగోని మీనా గౌడ్, వైద్యులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

**యాలాల సెప్టెంబరు 10,ప్రభాతవార్త :** ఆరోగ్యకరమైన భవిష్యత్తు తరాల నిర్మాణం కోసం ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని యాలాల ఎంపిపితాళ్లపల్లి బాలేశ్వర్ గుప్తా పేర్కొన్నారు. అందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు పౌష్టిక ఆహారంపై గర్భిణీలకు పూర్తి స్తాయిలో అవగాహణ కల్పించాల్సి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ఎంపిపి బాలేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం యాలాల మండల పరిషత్ కార్యలయ ఆవరణలో పోషణ అభియాన్,పోషణమాసం కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమాంతాలు,అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండలంలోని 37 గ్రామ పంచాయతీలనుంచి అంగన్‌వాడి కార్యకర్తలు గర్భిణీ మహిళలను తీసుకువచ్చారు.సుమారు ఒక వందకు పైగా గర్భిణీలు కార్యక్రమంలో పాల్గొనగా హాజరైన ప్రతి ఒక్క గర్భిణీస్త్రీలకు ఎంపిపితో పాటు అథితులుగా విచ్చేసిన తాండూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునితా సంపత్,పెద్దెముల్ ఎంపిపి అనురాధ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుశీల్ కుమార్ గౌడు,మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ దీపానర్సిములు,ఐసిడిఎస్ డిడబ్ల్యూఓ లలితకుమారి,వైస్ ఎంపిపి రమేష్,సిడిపిఓ రేణుకా,కో ఆప్షన్ సంఘం అధక్ష్యులు అక్బర్ బాబా తదితరలు సాంప్రదాయంగా వస్తున్న సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓ వైపు అధికారులు మరో వైపు ప్రజాప్రతినిధులు గర్భిణీ స్త్రీలకు చీర సారెలు,పూలు పండ్లు గాజులను అందించి చేసిన సీమంత కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిపారు.ఇక్కడ జరిగిన సీమంత కార్యక్రమం పుట్టింట్లో ఆడపడుచులకు చేసే సీమంతం కార్యక్రమాన్ని తలపించింది.అనంతరం ఎంపిపి,జిల్లా గ్రంధాలయ చైర్మన్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్,డిడబ్ల్యూఓ తదితరులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యకరమైన పిల్లలకు జన్మనిస్తారని తెలిపారు.పోషక ఆహార లోపం ఉంటే పుట్టబోయో బిడ్డలు అంగవైకల్యంతో పాటు బలహీనంగా పుడుతారని వారు తెలిపారు.రానున్న తరాల్లో మంచి ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి అందుబాటులో ఉండే పౌష్టిక ఆహారాన్ని తినాలన్నారు.ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు అంగన్‌వాడి కేంద్రాల నుంచి అందించే పౌష్టిక ఆహారాన్ని అందరూ సద్వినియోగం చేయాలని వారు సూచించారు.తెలంగాణ సర్కార్‌లో గర్భిణీల కోసం వివిధ పథకాలు చేపట్టి ఆరోగ్యమైన భవిష్యత్ తరాల సమాజ నిర్మాణానికి ఎంతో కృషి చేస్తోందని వారు కొనియాడారు.ముఖ్యంగా ఐసిడిఎస్ అంగన్‌వాడి కార్యకర్తలు పౌష్టిక ఆహారం అందివ్వడంలో మరింత శ్రద్ద వహించాలని వారు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యం పట్ల పూర్తి అవగహాణ కల్పించే భాద్యత అందరిపై ఉందన్నారు.అనంతరం పిల్లలకు అన్నప్రాసన కర్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన అథితులను మండల పరిషత్ తరుపున ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సర్పంచులు,ఎంపిటిసి సభ్యులు,వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు,మహిళలు,నాయకులు వడ్డె రాములు,లాలుముదిరాజ్,శేఖర్‌రెడ్డి,రఘు,క్రిష్ణ,ఆకుల బస్వరాజ్,ఆశన్న,వెంకటయ్య శివకుమార్,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి తల్లులకు పెద్దకొడుకు కెసిఆర్ : ఎమ్మెల్యే





రంగాపూర్‌లో ఆసరా ఫించన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**నందిగామ సెప్టెంబర్10,ప్రభాతవార్త :** పేదింటి తల్లులకు పెద్దకొడుకు సిఎం కెసిఆర్ పెద్ద కొడుకు లాంటి వాడని,ఆసరా పింఛన్లతో పెద్దల ఆత్మగౌరవం పెంపొందుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు.శనివారం నందిగామ మండలం రంగాపూర్ గ్రామ శివారులో నాట్కో హైస్కూల్ సమావేశమందిరంలో రంగాపూర్,చాకలిధనిగుట్ట తండా గ్రామ పంచాయతీల్లోని అర్హులైన వారందరికి నూతన ఆసరా పింఛన్ల కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...75 ఎళ్ల స్వాతంత్ర చరిత్రలో ఎవరు చేయని విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ సబండ వర్గాలకు మేలు చేస్తున్నారని పేర్కొన్నారు.రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికి ఆసరా పింఛన్లు అందిస్తుందని తెలిపారు.అంతకుముందు నందిగామ,మేకగూడ గ్రామాల్లో అర్హులైన వారందరికి పింఛన్ కార్డులను పంచారు.ఈ కార్యక్రమంలో జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,ఎంపిపి ఎం.ప్రియాంక,వైస్ ఎంపిపి ఎం.మంజుల ,మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్, సర్పంచ్‌లు జిల్లెల వెంకట్ రెడ్డి,ఎనుగొండ రమేష్ గౌడ్,జెట్టావత్ రాజు నాయక్, పాండురంగారెడ్డి,ఎంపిడివో బాల్ రెడ్డి,ఉప సర్పంచ్ విస్లావత్ రాణి,టిఆర్ఎస్ నాయకులు తోట చంద్రయ్య మూడావత్ తులసిరాం,కిషన్ నాయక్,రాజ్యలక్ష్మీ,తోట మహేందర్,కల్వకోలు శేఖర్ గౌడ్,విజయ్ నాయక్,జింకల చంద్రశేఖర్,ఆవుల అంజనేయులు,గోవు నర్సింలు,సోమ్లానాయక్,ఎం.రవిందర్ నాయక్,ఎఎంసి డైరెక్టర్ గోపాల్ నాయక్,కార్యదర్శులు శ్రీనివాస్‌చారి,టిఆర్ఎస్ కార్యకర్తలు,ఆసరా ఫించన్‌దారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి.

**షాద్‌నగర్, సెప్టెంబర్ 10, (ప్రభాతవార్త) :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలు పూర్తిగా సమస్యలతో నిండిపోయాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలల దుస్థితి అధ్వాన్నంగా తయారైందని, పాఠశాలల్లో కనీసం చాక్‌పీస్‌లు కొనే పరిస్థితి లేదని ఆయన మండి పడ్డారు. సమగ్ర శిక్షపథకం ద్వార పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 శాతం, 40 శాతంగా నిధులు విడుదల చేయాలి కాని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయ్యడం లేదని, దీంతో పాఠశాలల్లో కనీస అవసరాలను తీర్చుకోలేని స్థితిలో విద్యావ్యవస్థ కుంటుపడుతుందని ఆయన మండి పడ్డారు. పాఠశాలల్లో అటెండర్లు, స్కావెంజర్లు లేక ఉపాధ్యాయులే గదులను శుభ్రం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ డీప్యూటేషన్ ద్వార పేద పిల్లలకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. 317జీఓ ద్వార స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, ఏయిడెడ్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, స్పౌజ్ బదిలీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, బిజిలి సత్యం, యూటీఎఫ్ నాయకులు శేఖర్‌గౌడ్, కృష్ణ, బాలయ్య, చంద్రశేఖర్, సురేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే

# సిఎం కెసిఆర్ లక్ష్యం



లబ్దిదారులకు పింఛన్ కార్డులు అందజేసుత్న ఎమ్మెల్యే

**కొత్తూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** అభివృద్ధి, సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యంగా పయనిస్తున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. కొత్తూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో కలిసి శనివారం లబ్దిదారులకు నూతన ఆసరా పెన్షన్ కార్డులను పంపిణీ చేశారు. కార్డులు పొందిన వారు కొత్తూర్ మండలంలోని తీగాపూర్ 22మందికి, మల్లాపూర్ 35, గూడూరు 11, మక్తగూడ10, మల్లాపూర్ తండా 8మంది లబ్దిదారులకు నూతన ఆసరా పెన్షన్ లబ్దిదారులకు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ....అభివృద్ధి సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.3016, వృద్దులు, వితంతువులకు, ఇతర కేటగిరీల వారికి రూ.2016 చొప్పున అందిస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను చేయడంతో పాటు వారి ఆత్మగౌరవం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా అత్యుత్తమ సంక్షేమ,అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని కొనియాడారు.

## ఘనంగా అమ్మవారి తోట కాలనీ వినాయక ఉత్సవాలు

**యాచారం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని అమ్మవారి తోట కాలనీలో విఘ్నేశ్వర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బిఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు తెలుగుమళ్ల అనిత రవీందర్, మండల రైతు సమన్వయ సమితి చైర్మన్ కొంగల జోగిరెడ్డి, ఉపాధ్యాయులు మరాఠీ యాదయ్య, విశ్రాంత ఉద్యోగి చిట్టిమల్లు శాంతయ్య, భూపతి బుగ్గ రాములు తెలుగుమళ్ల యాదయ్యలు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చందాలు లేకుండా వినాయక ఉత్సవాలు జరపడం ఎంతో అభినందనీయమన్నారు. సాంప్రదాయబద్ధంగా సంస్కృతిని కాపాడుకునే పండుగ అని గుర్తు చేశారు. ఉత్సవాలకు తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మరాఠి వివేక్, శెట్టిమల్ల శ్రీకాంత్, పంబాల శివాజి, చెట్టిమల్ల శ్రీనాధ్, తెలగమల్ల ప్రశాంతం, మహేష్, కర్ణ, శివ, వంశీ పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న బిఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మరాఠీ యాదయ్య, చెట్టిమల్ల శాంతయ్య

## తాండూర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**తాండూర్ టౌన్ సెప్టెంబర్10,ప్రభాతవార్త :** తెలంగాణ తెగువను చాటి,నిరుపేద గుండెల్లో నిలిచిన తెలంగాణ వీరనారి ఐలమ్మ అని రాష్ట్ర బిసి కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్ అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తాండూర్ రజక సంఘం సభ్యుల పిలుపు మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ...తెలంగాణలో ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తున్నది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.తెలంగాణ వీరనారి ఐలమ్మ పోరాట పటిమకు తగిన గౌరవం దక్కిందన్నారు.సిఎం కెసిఆర్ ఐలమ్మ జయంతి అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం గొప్పవ విషయమని చెప్పారు.ఆనాటీ సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను చాకలి ఐలమ్మ గలగలాడించారన ఆమె సేవలను కొనియాడారు.త్వరలో వికారాబాద్ జిల్లాలో బిసి స్టడీ సెంటర్లు ప్రారంభిస్తున్నట్లు శుభప్రద్ పటేల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్,తాండూరు మున్సిపల్ కౌన్సిలర్లు రాము, బోయ రవి,బిసి రాజ్ కుమార్,సునీత,సంపత్,బిసి నాయకులు శుకుర్ ,నాయకులు భాను,బాలు చారి,శ్రీశైలం,రాము,విజయ్,తాండూర్ రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక లడ్డును కైవసం చేసుకున్న సర్పంచ్ హైదర్



రేగొండిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**పెద్దేముల్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** 11 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు నిమజ్జనానికి సిద్ధమైన సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో వినాయక లడ్డును సర్పంచ్ హైదర్ కైవసం చేసుకున్నాడు. పెద్దేముల్ మండలం రేగొండిలో 11 రోజుల పాటు వినాయకుడు పూజలందుకుంటు శనివారం నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలంలో సర్పంచ్ హైదర్ రూ.23,600లకు దక్కించుకున్నాడు. గత ఏడాది కూడా రూ. 22 వేలకు సర్పంచ్ హైదర్ లడ్డును కైవసం చేసుకున్నాడు. కైవసం చేసుకున్న లడ్డును గ్రామ ప్రజలకు పంపిణీ చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మతాలు వేరైన మానవత్వం ఒకటేనని, భక్తికి కులమతాలు అడ్డురావని, అందుకు ఉదహరణగా సర్పంచ్ హైదర్ అని అన్నారు.ప్రతి యేటా వేలంలో దక్కించుకున్న లడ్డుతో పాటు అన్నదానం నిర్వహిస్తున్న సర్పంచ్ హైదర్ అభినందనీయులని కొనియాడారు.

## గ్రంధాలయాల అభివృద్ధికి తనవంతు కృషి

### -జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుశీల్‌కుమార్ గౌడు



జిల్లా గ్రంధాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా

**యాలాల సెప్టెంబరు 10,ప్రభాతవార్త :** గ్రంధాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వికారాబాద్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుశీల్‌కుమార్‌గౌడు (రాజుగౌడు) పేర్కొన్నారు.శనివారం యాలాల మండల టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రంధాలయ చైర్మన్ రాజుగౌడుకు పన్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగ నూతనంగా జిల్లా గ్రంధాల చైర్మన్ ఎన్నికైన రాజు గౌడును ఎంపిపి బాలేశ్వర్ గుప్తా,మండల పార్టీఅధ్యక్షులు రవీందర్‌రెడ్డి, మండల నాయకలు శాలువా పూలమాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ తనకు చైర్మన్ పదవి దక్కడంలోకీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.పార్టీ పటిష్టతతో పాటు మరోసారి రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకుశాయశక్తులా పనిచేస్తానన్నారు.ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా,పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీలో యువతకు పెద్ద పీఠ వేయడం జరుగుతోందన్నారు.పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారికి పదవులు దక్కుతాయనడానికి గ్రంధాలయ చైర్మన్ ప్రత్యేక ఉదాహారణ అని వారు పేర్కొన్నారు.తెలంగాణసర్కార్ మహిళలకు,రైతులను ఆదుకోవడంతోపాటు ,విద్యా, వైద్యం ,అభివృద్ధి,సంక్షేమ పథకాలతో దూసుకెళ్తున్న వైనాన్ని వారు వివరించారు.ఈ కార్యక్రమంలోమండల సర్పంచులు,ఎంపిటిసిలు,నాయకులు పాల్గొని గ్రంధాలయ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

## ప్రతి ఒక్కరూ చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

**కొడంగల్ రూరల్, సెప్టెంబర్, 10 (ప్రభాతవార్త):** ప్రతీ ఒక్కరూ వీరనారి చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని రజక సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంబేద్కర్ చౌరస్తాలో రజక సంఘం మండల అధ్యక్షుడు అశోక్, అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మకు చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెత్తందారి వ్యవస్థను రూపుమాపేందుకు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛాయుతంగా జీవించాలంటే ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మత్యప్ప, నందారం శ్రీశైలం, నాగప్ప, కె.దస్తప్ప, యం.వెంకటేశం, జి.అశోక్, వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షురాలు సంధ్యారాణి, లలిత, మోహన్, శ్రీనివాస్ రఘు, ఆంజనేయులు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాయం ముందు చాకలి ఐలమ్మ వర్ధంతిలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, వీఆర్ఏలు

## గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

**మర్కుక్, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించి వాటి విలువలను వారికి తెలుపాలని సర్పంచ్ గడ్డం ప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని యూసుఫ్‌ఖాన్‌పల్లి అంగన్ వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ గడ్డం ప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో లక్షల రూపాయలు వెచ్చించి పౌష్టికాహారం అందిస్తుందని, వీటిని బాలింతలు, గర్భిణీలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, ఏఎన్ఎం స్వప్న, ఆశ వర్కర్ రాధిక, సిఎ కవిత, వార్డు సభ్యులు రామచంద్రం, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

**రాయపోల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతూ కార్పోరేట్ ఆస్పత్రులలో చికిత్స చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్ అన్నారు. రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నాంసాని సందీప్‌కు 9500, అల్వాల రాజవ్వకు 23000, కస్తూరి ఆంజయ్యకు 26000 వేల రూపాయల సిఎం సహాయనిధి చెక్కులు మంజూరు కాగా శనివారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు వారికి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ అందజేసారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నామసాని రాజు, నాయకులు మహేష్‌గౌడ్, రమేష్, విజయ్, మల్లేశం, పిడిచెటి స్వామి, పరుశురాములు, కనకయ్య, ప్రవీణ్ తదితరు లు పాల్గొన్నారు.

**మర్కుక్‌లో..**

**మర్కుక్, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలకేంద్రానికి చెందిన లింగంపల్లి చందనకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంత్రి హరీశ్‌రావు సహాయ సహకారంతో మంజూరైన రూ. 41,500 చెక్కును శనివారం లబ్దిదారునికి కుటుంబానికి స్థానిక సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని, ఇలాంటి అవకాశాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ టిఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింలు, టిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిని మహేష్, పాపోళ్ళ రాజు, నవీన్, కర్ణాకర్, మల్లేష్‌యాదవ్, మల్లేష్‌ముదిరాజ్, లింగం, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అరె కటికల ఆత్మీయ సభ కర పత్రం విడుదల

**సిద్ధిపేట అర్బన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :**

అరె కటికల అత్మీయ సభ కర పత్రాన్ని జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సంఘం నాయకులు అవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట అరె కటికల అభివృద్ధి సంఘం అధ్యక్షులు మధుసూదన్ దాదా మాట్లాడుతూ ఈనెల 20న మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కేంద్రంలోని నాగదేవత దేవాలయం సమీపంలోని నందాల వెంకట లక్ష్మీ గార్డెన్‌లో అరె కటికల అత్మీయ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సభకు రాష్ట్ర అర్ధిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు , అరె కటికల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజభింకర్ భూంపల్లి అశోక్ దాదా, సిద్దిపేటలోని ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సభకు అరె కటికలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గజబీంకర బాలకిషన్, బాలరాజు, డబ్బికార్ రమేష్, అంకార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు

**హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్**

**కోహెడ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** దేశానికే అదర్శంగా అసరా పెన్షన్లు నిలుస్తాయని.. అర్హులైన ప్రతి ఒక్కరికీ అసరా పెన్షన్ అందించడం జరుగుతుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్‌కుమార్ అన్నారు. కోహెడ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసరా పెన్షన్ లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. కోహెడ మండలంలో గతంలో 7002 పెన్షన్ లబ్దిదారులు ఉండగా ప్రస్తుతం మరో 1269 మందికి నూతనంగా పెన్షన్లు అందించడం జరుగుతుందన్నారు. అసరా పెన్షన్ డబ్బులు ప్రతి నెల నేరుగా లబ్దిదారుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కోహెడ మండలానికి అసరా పెన్షన్ల రూపంలో కోటి 77 లక్షల 87 వేల 336 ప్రతి నెల అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కీర్తన సర్పంచ్ పెర్యాల నవ్యదేవేందర్‌రావు, పిఎసిఎస్ చైర్మన్ పెర్యాల దేవేందర్‌రావు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

**రాయపోల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

రాయపోల్ మండల పరిధిలోని బేగంపేట గ్రామ శివారులో ఓ పౌల్ట్రీఫామ్‌లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా డంపు చేసిన అలాగే రెండు మహేంద్ర ట్రాలీ ఆటో వాహనాలలో డంపు చేయడానికి తరలిస్తున్న 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని బేగంపేట పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సిఐ గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాయపోల్ మండలం బేగంపేట గ్రామ శివారులోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో అక్రమంగా రేషన్ బియ్యం డంపు చేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి రైడ్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పేద ప్రజల గురించి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొంతమంది వారి స్వార్థం స్వాలాభం కోసం ప్రజల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యాపారస్తులకు ఎక్కువ రేటుకు విక్రయించి డబ్బు సంపాదిస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై జిల్లాలో గట్టిగా నిఘా ఏర్పాటు చేసామని ప్రభుత్వ రేషన్ బియ్యం కొనుగోలు చేసిన ఇతరులకు అమ్మిన అక్రమంగా రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రక్తదానం చేసిన ఎస్ఐ శివానందం

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన మహిళ అపరేషన్ సమయంలో అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా పోలీసు మిత్రుల ద్వారా విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ శివానందం వెంటనే స్పందించి సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. చికిత్స పొందుతున్న మహిళకు అపద సమయంలో రక్తదానం చేసిన ఎస్ఐ శివానందంకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటీ వరకు సిద్దిపేట పోలీసు కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది 294 యూనిట్ల రక్తదానం చేసినట్లు సీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



కొమురవెల్లిలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం



ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



సిద్దిపేట సీపీఎం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

# చాకలి ఐలమ్మ సేవలు మరువలేము

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** భూమి..భుక్తి.. వెట్టిచాకిరి విముక్తి కోసం అహర్నిశలు పోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి వేడుకలను జిల్లాలోని అయా ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహిం చారు. అమె విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**కొమురవెల్లిలో..**

వీరనారి చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని.. మండల సీపీఎం పార్టీ కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో అమె వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా విసునూరు రామచంద్రారెడ్డి అగడాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో యువత పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐనాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి నరేష్, చెరుకు వెంకటరెడ్డి, సార్ల యాదయ్య, శ్రవణాచారి, గోరిమియా తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో..**

దొరలను ఎదిరించి వెట్టి చాకిరి విముక్తి, భూమి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ అని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శులు సభ్యులు కాముని గోపాలస్వామి అన్నారు. చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ విన్నూరు రామచంద్రారెడ్డి దొర గుండెల్లో రైళ్ల పరిగెత్తించిన పుచ్చపల్లి సుందరయ్య, షేక్‌బందగి, దొడ్డి కొమరయ్య, షోయబుల్లాఖాన్, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి, చాకలి ఐలమ్మ లాంటి అనేక మంది అమ రుల అశయాలను కొనసాగించడానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఈనెల 15న వీరబైరా న్‌పల్లిలో సంస్కరణ సభ నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాళ్లబండి రవికుమార్, సనాది భాస్కర్, రవీందర్‌రెడ్డి, జాలిగపు శిరీష, చందు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో..**

చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం అధ్యక్షులు పురుట్ల చంద్రయ్య అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గాజుల బాబు, మాజీ సర్పంచ్ ఏలేటీ నర్సింహ్మారెడ్డి, అరుణరాజారెడ్డి, రజక సంఘం సభ్యులు సురేందర్ బాబు, భూపతి, రవి, ఎల్లం, సంపత్, తిరుమల్, స్వామి తదితరులు అమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**మాల మహానాడు అధ్వర్యంలో..**

మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి అధ్వర్యంలో తెలంగాణ వీరనారి రజక ముద్దుబిడ్డ చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ భవనం వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్య క్రమంలో



చేర్యాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శివగారి అంజయ్య



మర్కుక్‌లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శివరాజయ్య, రాములు, నర్సింలు, మల్లేశం, బాలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చేర్యాలలో..**

**చేర్యాల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

మండలంలో చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండల రజక సంఘం అధ్యక్షుడు శివగారి అంజయ్య అధ్వర్యంలో స్థానిక అంగడి బజార్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులులర్పించారు. అనంతరం శివగారి అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట విల్లంబై అపుల పెరుగని ఆయుధమై కదిలిన ధీరవనిత చాకలి ఐలమ్మ, దొరగాడి గుండెలపై సింహ స్వప్నమై గర్జించిన విప్లవ మూర్తి, మహిళా చైతన్య స్ఫూర్తి, నిరంతరం మార్పు కోసం పని చేసి తెలంగాణ ప్రజలకు ఆదర్శమైన వ్యక్తి ఒక ఉన్నతమైన ఆశయాల కోసం ఉద్యమిస్తూ, ఎం తో మందికి ప్రేరణాగా నిలిచిందని ఆయన కొనియా డారు. తెలంగాణ ప్రాంతమంతా నైజాం ఏలుబ డిలో ఉండి దొరలు, భూస్వాములు, జాగీర్దారులు, మాల్ పటె ల్ పట్వారీ వ్యవస్థను ధ్వంసం చేయడానికి కార్మిక, కర్షక పోరాటాలకు పురుడు పోస్తున్న కాలంలో రైతులంతా సంఘటితమై ఆంధ్ర మహాసభ అండతో కదులుతున్న సందర్భంలో దొర అహంకారానికి, అరాచకాలను అడ్డుకొని విముక్తి కలిగించాలని సాయుధ పోరాటానికి నడూం కట్టి తుపాకి చేత బట్టి నడిచిన వీరనారి. సాయుధ పోరాట చరిత్రలో ఐలమ్మ ప్రస్థానం చిరస్మర ణీయం. ఈ కార్యక్రమంలో ముస్త్యాల బాల్‌నర్సయ్య, చేర్యాల మున్సిపల్ కౌన్సిలర్ లీల సంజీవులు, కొము రవెళ్ళి మాజీ డైరెక్టర్ చింతల పర్శరాములు, రజక సంఘం మండల ఉపాధ్యాక్షుడు బండకింది కరుణాకర్, శ్రీను, కనకయ్య, మహేష్, సాయిబాబు, సాగర్, మిల్లపురం అంజయ్య, చంద్రమోలీ, బాలస్వామి, పరశురాములు, జగన్, గుడ్ల అంజయ్య, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మర్కుక్‌లో..**

**మర్కుక్, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):** వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలో శనివారం రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన





చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహిస్తున్న జిల్లా తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

నిప్పు కణిక వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ టిఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింలు, టిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిని మహేష్, రజక సంఘం అధ్యక్షుడు పాపోళ్ళ రాజు, నవీన్, కర్ణాకర్, మల్లేష్‌యాదవ్, మల్లేష్‌ముదిరాజ్, లింగం, శ్రీకాంత్‌గౌడ్, రజక సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**మునిపల్లిలో...**

**మునిపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మునిపల్లిలో శనివారం నాడు చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. సంగారెడ్డి జిల్లా తీన్మార్ మల్లన్న టీం కన్వీనర్ రమేష్ యాదవ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూమికోసం, భుక్తికోసం, వేట్టి చాకిరి విముక్తికోసం పోరాడిన వీరానారి అని ఈ సందర్భంగా ఐలమ్మను కొనియాడారు. తెలంగాణ తల్లి భూమి పోరాటానికి నాంది పిలికిన వీరామాత సామాజిక ఆధునిక పరిమాణానికి నాంది పలికిన ధైర్యశాలి అయిన చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ప్రతి గ్రామంలోనూ, ప్రతి మండలంలోనూ చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆడపిల్లలు ఇంటికి పరిమితం కాకుండా ఒక కలెక్టర్, ఎస్పీగా, డిఎస్పీ లాంటి ఉన్నతమైన ఉద్యోగాలకోసం శ్రమించాలన్నారు. ఆడపిల్లకు తెలిసి తెలియని టైంలో పెళ్లి చేయడం వల్ల మానసికంగా వారు కృంగిపోతున్నారన్నారు. ఒక్కసారి తల్లిదండ్రులు ఆలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రశాంత్ కుమార్, మునిపల్లి మండల రజక అధ్యక్షులు నర్సిలు, వీరప్ప, మల్లేశం, శివకుమార్, సాయన్న, పాపన్న లు పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** ఆంథోనీస్ కళాశాలలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమం శనివారం నాడు సెయింట్ ఆంథోనీస్ కళాశాలలో విద్యార్థుల ఆనంద కేరింతలతో అట్టహాసంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సాల్మన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఈ జ్యోతిరెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు వైవాలరెడ్డి, విజయ్‌రెడ్డి, అరుణరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జనగర్‌నిర్ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాల్మన్‌రెడ్డి, ఐపిఈ-2022 ఫలితాలలో స్టేట్ ర్యాంకు సాధించిన విద్యార్థినులకు, నీట్-2022 ఆల్ ఇండియా జెనరల్ కెటగిరిలో కె మనిషా, ఎస్ భవాని, పిడబ్ల్యూడి కెటగిరి ర్యాంకును సాధించిన విద్యార్థినులకు మెమెంటోలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిరెడ్డి లు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు దిశను నిర్దేశించుకొని ఉన్నత ఫలితాలనను సాధించాలని సూచించారు.

## ఉద్యమకారులకు తెలంగాణలో సరైన న్యాయం

**జెడ్పిటీసీ కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గౌరి శంకర్ శనివారం నాడు పటాన్‌చెరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసినందుకు గుమ్మడిదల మండల జెడ్పిటీసీ కుమార్ గౌడ్ శాలువతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ సమయంలో ఉద్యమాలు చేపట్టిన ప్రతి వారికి ఏదో ఒక రకంగా ఉద్యమకారులను గుర్తిస్తున్న ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. గుమ్మడిదల మండలం చెందిన గౌరి శంకర్ పటాన్‌చెరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రమాణస్వీకారం చేసినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గటాడి రమేష్, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి

**గుమ్మడిదల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో గుమ్మడిదల మండల బీజేపీ కార్యాలయంలో శనివారం నాడు చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు నందీశ్వర్ గౌడ్ పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రతి ఒక్కరి త్యాగ ఫలితం ఏ రకంగా ఉంటుందని రజాకర్లను వీరనారి చాకలి ఐలమ్మ ఎదిరించిన ఘనత ఆమెకే దక్కిందని అన్నారు. భావితరాలు ఆమె ఘనతను కొనియాడే విధంగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, కావలి ఐలయ్య, మాజీ మండల అధ్యక్షులు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, కానుకుంట ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు అంజిరెడ్డి, దోమదుగు గ్రామ పంచాయతీ సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**గుమ్మడిదల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలోని వీరభద్రనగర్ కాలనీలో నివాసముండే దాచారం మహేష్ బిల్డింగ్ రైలింగ్‌పై నుండి ప్రమాదవశాత్తు కిందపడి కాలు, నడుము భాగాల్లో ఫ్రాక్చర్ అవ్వడం జరిగింది. ఇట్టి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కి బొంతపల్లి స్థానిక టీఆర్ఎస్ నాయకులు తెలియజేయడం జరిగింది. ఇట్టి సంఘటన గురించి తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి ద్వారా ఇరవై వేల రూపాయల ఆర్థికం సాహాయం దాచారం మహేష్ కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఆపద సమయంలో ఆదుకున్నందుకు దాచారం మహేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి, సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డికి ఆర్థిక సహాయం అందజేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.



అమరవీరుల స్థూపం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న దృశ్యం

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** దున్నేవా డిదే భూమని సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ నిప్పురవ్వ అని టీఆర్ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు పట్లోరి రాజు అన్నారు. శనివారం రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి చంద్రం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని మండల కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. టీఆర్ఎస్ పార్టి మండల అధ్యక్షుడు పట్లోరి రాజు మాట్లాడుతూ పట్టణంలో చాక లి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అలాగే జంగరాయి గ్రామంలో సర్పంచి జ్యోతి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు కన్వీనర్ లక్ష్మారెడ్డి, సర్పంచులు ఫోరం మండల అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి, రజక సంఘం మండల అధ్యక్షుడు అంబి సురేష్, శ్రీనివాస్, సర్పంచులు సిద్దిరాంరెడ్డి, సాయం పోచయ్య, నాయ కులు అంజాగౌడ్, టీఆర్ఎస్వీ నరేష్, కుమ్మరి మహేష్, బాబు, నవీన్, వెంకట్, యాదగిరి, చాకలి నీలం, ముత్యాలు, కుమార్, యాదగిరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జలాంజనేయస్వామికి వెండి కిరీటం

**నర్సాపూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మండల పరిదిలోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన శ్రీ జలహనుమాన్ ఆలయంలోని శ్రీ జలాంజనేయస్వామికి దాతలు వెండి కిరీటం బహుకరణ చేయడం జరిగింది. హత్నూర మండలంలోని దౌల్తాబాద్ కు చెందిన దాతలు మంగిలాల్ ప్రజాపత్ కుటంబ సభ్యులు శ్రీ జలాంజనేయస్వామికి వెండి కిరీటం బహుకరణ చేయగా ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలను వారు స్వంతంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి అధ్వర్యంలో ఈ జలహనుమాన్ ఆలయంలో భక్తులకు దాతలకు అన్ని వసతులను కల్పించడం జరిగింది. ఆలయ పూజారి రాధాకృష్ణశర్మ అధ్వర్యంలో రాజు, శివ పంతుళ్ళ చే వేద మంత్రాల పఠించగా శ్రీ జలాంజనేయస్వామికి వెండి కిరీటం ధరించి పంచామృతాబిషేకం, చందన లేపనం వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి తో పాటు వెండి కిరీటం, అన్నదాన దాతలు మంగిలాల్ ప్రజాపత్ కుటుంబ సభ్యులు, ఆలయ పూజారులు రాధాకృష్ణశర్మ, రాజు, శివ పంతుళ్ళు. గ్రామ పెద్దలు బిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.



• వెండి కిరీటం బహూకరణ చేస్తున్న దాతలు మంగిలాల్ ప్రజాపత్ కుటుంబ సభ్యులు

## అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

**ర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు**

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. శనివారం మండల పరిధి చందాపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో నూతనంగా నిర్మించే ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కి సిడిపి నిధుల నుండి రూ. 5లక్షలు, బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుండి 2.5లక్షల ప్రోసిడింగ్ కాపీలను సర్పంచి రమాదేవి, గ్రామస్తులకు అందిచారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మాధవికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు కన్వీనర్ లక్ష్మారెడ్డి, జంగరాయి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, నాయకులు పడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న వీఆర్‌ఏల సమ్మె**

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** సాక్షాత్తు ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఇచ్చిన హామిలను ఎందుకు నెరవేర్చడం లేదని వీఆర్ఏల మండల అధ్యక్షుడు గడ్డం మైపాల్ ప్రశ్నించారు. తమ హామిలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏలు చేస్తున్న సమ్మె శనివారానికి 48వ రోజుకు చేరింది. ఆనంద్, వీరయ్య, పద్మ పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి

**నర్సాపూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** ప్రజా కార్మిక వ్యతిరేక విదానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం నాడు నర్సాపూర్‌లోని సిపిఎం పార్టీ కార్యాలయంలోచాకలి ఐలమ్మ 37 వ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజుతో పాటు నాయకులు భైల్పాటి గణేశ్, విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

**నర్సాపూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న శ్రీ అయ్యప్ప దేవాలయ నిర్మాణ పనులను మేడ్చల్ జిల్లా పూడూరులోని అయ్యప్ప దేవాలయ నిర్మాణ కర్త మల్లారెడ్డి డాక్టరేట్ పొందిన తర్వాత ఈ అయ్యప్ప దేవాలయ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ వచ్చిన మల్లారెడ్డి ని నర్సాపూర్ అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ డి. అశోక్‌గౌడ్ అధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ డి. అశోక్‌గౌడ్ తో పాటు శంకర్‌రెడ్డి, పెద్ద రమేశ్‌గౌడ్, దేవాగౌడ్, కరుణాకర్‌రెడ్డి, రాములు, వెంకటరమణ, శ్రీశైలం, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్టీలు కొట్టిన కారు.. వ్యక్తి మృతి

**కంది, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** అతివేగంగా వెళుతున్న కారు పల్టీలు కొట్టిన సంఘటన ఓ వ్యక్తి అక్కడికి అక్కడే మరణించిన ఘటన శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఓడిఎఫ్ వై జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఖదీర్ తన చిన్నమ్మ కుమారులు ఆబేద్, జావీద్‌లతో కలిసి రాత్రి గణేష నిమర్జన ఉత్సవాల్లో పాల్గొని నృత్యాలు చేసి అలసిపోయి ఉండటంతో టీ తాగేందుకు తమకు చెందిన ఆల్టో కారు (ఎపి 11ఎస్ 9785)లో ఆబేద్ కారును తోలుకుంటూ వెళ్లాడన్నారు. ఎద్దుమైలారం వైపు వెళ్లి అక్కడ టీ కొట్టులు మూసి ఉండటంతో తిరిగి సంగారెడ్డి పట్టణం వైపు వెళుతున్న క్రమంలో కారు స్పీడు పెరిగి అదుపు తప్పడంతో ఓడిఎఫ్ వై జంక్షన్ వద్ద జల్‌కల్ వైపు కారు అదుపు తప్పి బోల్తా కొడుతూ వ్యవసాయ భూమిలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో ఖదీర్ (25) అక్కడికి అక్కడే మృత్యువాత పడగా జావిద్ గాయాలకు గురయ్యాడన్నారు. మృతుని సోదరుడు సర్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.


## సింగూరు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

**పుల్కల్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఎగువన కురిసిన భారీ వర్షాలతో సింగూరు ప్రాజెక్టులోకి వరద నీరు చేరడంతో శనివారం అధికారులు గేట్లను ఎత్తి కిందికి నీటి వదిలారు. ప్రాజెక్టులోని 9వ గేటును2 మీటర్ల ఎత్తులోకి, 6వ గేటును 2.5మీటర్ల ఎత్తుకి,15వ గేటును 1.5 మీటర్ల ఎత్తుకు తెరిచి నీటిని విడుదల చేశారు. మూడు గేట్ల ఎత్తివేతతో ప్రాజెక్టు నుంచి నీరు అధికంగా ప్రవహిస్తుందని, అందుకు ప్రజలు జాగ్రత్తలు వహిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

**రాయికోడ్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన రాయికోడ్‌లో శ్రీ హనుమాన్ మందిర ఆవరణలో వినాయక ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడిని శనివారం నిమర్జనం చేశారు. 11 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న ఏకదంతుడు శనివారం భక్తుల భజనల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు. గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో యువత పెద్ద సంఖ్యల పాల్గొని లంబోదరుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి,సీఎం సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డిచేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కంగ్టి మండల తెరాస పార్టీ అధ్యక్షులు గంగారాం, చాప్టా కెసర్పంచ్ సంగప్ప, నాగల్‌గిద్దా మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు జాదవ్ లక్ష్మన్ తదితదిరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** శ్రీ శంకరమఠం ధర్మకర్త ఠాకూర్ కిషన్‌సింగ్ సౌజన్యంతో, శారదామాత దేవాలయ ప్రాంగణంలో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించగా విజయవంతంగా ముగిసింది. అమెరికాలో 14 యేండ్లుగా అనుభవం కలిగిన డాక్టర్ సమీర్ కుమార్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ధర్మకర్త కిషన్‌సింగ్ తదితరులు మాట్లాడారు. శిబిరంలో హెల్త్ కార్డు అందించడంతో పాటు బీపీ, షుగర్,హైట్, వెయిట్, తదితర రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గౌరీభట్ల నర్సింహస్వామి, లక్కిరెడ్డి విజయ, శుభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వినాయకునికి ఘనంగా పూజలు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలోని 42వ వార్డులో శివాజీ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవం నిర్వహిస్తున్నారు. నవరాత్రోత్సవాలలో భాగంగా శనివారం కౌన్సిలర్ కాటం శోభరఘురామ్, టిఆర్ఎస్ నాయకులు రఘురామ్. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సేవాలాల్ గుడి నిర్మాణానికి హేమంత్ రాథోడ్ విరాళం

**నందిగామ సెప్టెంబర్10,ప్రభాతవార్త :**

నందిగామ మండలం చాకలిధని గుట్ట తండాలో తండా వాసుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహారాజ్, దుర్గామాత ఆలయాలకు బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పాత్లవత్ హేమంత్ రాథోడ్ తన వంతు సహాయంగా రూ.35వేలు వార్డు సభ్యుడు లింబ్యా నాయక్‌కు శనివారం అందజేశారు.ఈ సందర్భంగా హేమంత్ రాథోడ్ మాట్లాడుతూ...గిరిజనుల ఆరాధ్య దైవంగా కొలిచే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్,దుర్గామాత మరి యమ్మల ఆలయ నిర్మాణాలకు విరాళం అందజేయడం తాను అదృష్టంగానే భావిస్తున్నామన్నారు.సేవాలాల్ మహారాజ్ బోధనలు,ఆయన చూపిన మార్గం అనుసంణీయమన్నారు.ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసి సేవా దృక్పథాన్ని చాటుకున్న హేమంత్ రాథోడ్‌ను గిరిజన ప్రజాప్రతినిధులు,నాయకులు,తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## పెద్దషాపూర్ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**శంషాబాద్ సెప్టెంబర్10,ప్రభాతవార్త :**

శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా జిల్లా రమేష్ ముదిరాజ్ ఎన్నికయ్యారు.శనివారం గ్రామంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.నరసింహ, టి.నందు, ఎం.మల్లేష్ ,ప్రధాన కార్యదర్శిగా జిల్లా రాము,జిల్లా శ్రీనివాస ముదిరాజ్, కోశాధికారిగా జిల్లా మల్లేష్,జాయింట్ సెక్రటరీగా ఉప్పరి సురేష్ ఎన్నికయ్యారు. ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని శంషాబాద్ మండలం మాజీ ఎంపిపి పెద్ద షాపూర్ ఎంపిటిసి సభ్యుడు చెక్కల ఎల్లయ్య ముదిరాజ్,సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్,టిఆర్ఎస్ నాయకులు జిల్లా జగదీష్ ముదిరాజ్, సన్మానించారు. సలహదారులుగా జిల్లా హరిచందర్ ముదిరాజ్,చెక్కల ఎల్లయ్య, గణేష్, గోవర్ధన్ ,మహేందర్, సత్యనారాయణ, మల్లేష్,కృష్ణ, టి.కృష్ణ, సత్తయ్య, రాములు, రాజు,వ్యవహరిస్తారు.

## సమాజంలో వెలుగులు నింపేది ఉపాధ్యాయులే

**షాబాద్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :**

సమాజంలో అజ్ఞానం అనే చీకటిని తొలగించి వెలుగులు నిపేది ఉపాధ్యాయులేనని, పవిత్రమైన వృత్తికి న్యాయం చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు నానా జిపురం లింగం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ముది రాజ్ భవన్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడు బాల్‌రాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే ఉపాధ్యాయులు మనకు విద్యాబుద్దులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతారన్నారు. క్రమశిక్షణతో విద్యను పూర్తి చేసుకుని జీవితంలో సముచిత స్థానంలో స్థిరపడ్డప్పుడే తల్లిదండ్రులకు, గురువులకు సంఘంలో గౌరవం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉంచి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలన్నారు. సమాజంలో చెడును పారద్రోలడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దె బాధ్యత ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థులు మంచి కావాలన్న, చెడు కావాలన్న ఉపాధ్యాయులపై ఆధార పడి ఉంటుందన్నారు.

## పేద ప్రజలకు అండగా జీజేపీ : రామచంద్రరావు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :**

మాజీ మంత్రి శాసనమండలి సభ్యుడు రామచంద్రరావు పేద ప్రజలకు అండగా బీజేపీ నిలబడుతుందని బీజేపీ మాజీ శాసన మండలి సభ్యులు సీనియర్ నాయకులు రాచంద్రరావు అన్నారు. శనివారం వెంకటాపూర్ గ్రామంలో జరిగిన ప్రజాగోసా బీజేపీ భరోసా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ బైక్ ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ నరేంద్ర మోడీ పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయి అన్నారు. రాష్ట్రంలో 8 ఏళ్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం బూటకపు హామీలతో కాలక్షేపం గడుపుతన్నదన్నారు. అవినీతి ఆశ్రిత కుటుంబ పరిపాలనకు తెలంగాణ వేధికగా మారిందని విమర్శించారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి జిల్లా సహాయ ఇంఛార్జ్ రామకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంగారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, కోవూరు సంగమేశ్వర్, నెమలికొండ వేణుమాధవ్, దేశ్పావండే మాణిక్‌రావు, తోట చంద్రశేఖర్, శ్రీశైలం, సత్యనారాయణ, జింజిరాల విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు అంబదాస్, శివరాజ్, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా మల్లికార్జునస్వామికి మహారుద్రాభిషేకం

**సదాశివపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** సదాశివపేట లోని అయ్యప్ప మందిరంలో శనివారం నాడు బ్రమరంభ సమేత మల్లికార్జున స్వామికి భక్తులు ఘనంగా మహా రుద్రాభిషేకం చేశారు. శివగురు స్వామి రాచన్న సమక్షంలో అయ్యప్ప గురు స్వామి గణేష్ కుటుంబ సమేతంగా ఈ రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివమాల ధారణ చేసిన భక్తులు ప్రతి పౌర్ణమినాడు భక్తుల ఇంటివద్ద ఆ పరమశివుడికి మహా రుద్రాభిషేకం చేస్తున్నారు. శనివారం నాటి పౌర్ణమి నాడు అయ్యప్ప గురువు స్వామి గణేష్ ఆధ్వర్యంలో ఈ మహా రుద్రాభిషేకం గావించుచున్నారు. శివ స్వాములు సంగమేశ్వర మందిర పూజారి మోహన్‌రావు పంతుల, అయ్యప్ప మందిరం పూజారి నరేష్ పంతుల సమక్షంలో భజనలు, కీర్తనాలతో ఆలయం మారుమ్రోగింది. పూజానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

## మధనానాంద ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ

**కొల్చారం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిదిలోని రంగంపేట గ్రామశివారులోని శ్రీ మధనానాంద ఆశ్రమాన్ని శనివారం నాడు ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సందర్శించారు. ఆశ్రమంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం శ్రీ మధనానాంద సరస్వతి స్వామి గురుపాదుకలకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆశ్రమ ఫిఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతి స్వామి ఆశీస్సులు తీసుకుని స్వామి ఇచ్చిన తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శేరి సభాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి శాయశక్తుల కృషిచేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవనంద సరస్వతి స్వామి శిష్యబృందం, ఎమ్మెల్యే ఎస్ సుభాస్‌రెడ్డి లతో పాటు టీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## కొల్చారం మండల వ్యాప్తంగా భారీ వర్షాలు

**కొల్చారం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** కొల్చారం మండల వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. అలాగే రైతులు వేసిన వరిపంట పోలాలు వర్షపునీటికి నీటమునిగాయి. ఇంకా రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలియజేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నీటమునిగిన పంటలకు ప్రభుత్వంపరంగా రైతులకు నష్టపరిహారం అందజేయాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కులమతాలకు ప్రతీక సిద్దిపేట

### పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :**

కుల మతాలకు అతీతంగా సిద్దిపేట నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. శుక్రవారం రాత్రి సిద్దిపేట పట్టణంలోని 9వ వార్డులో శ్రీ బాల గణేష్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు లడ్డు వేలం పాటలో ముస్లిం నాయకుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ వేలం పాటలో పాల్గొని లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కుల మత అనే బేదం లేకుండా హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అంటూ సిద్దిపేటలో ప్రశాంత వాతావరణం ఉందన్నారు. వేలం పాటలో దక్కించుకున్న కాలనీలో ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ల సహాయంతోనే వినాయకులను నిమజ్జనం చేయాలన్నారు. కాగా వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్ సర్కారును సైతం ప్రజలు నిమజ్జనం చేస్తారని పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మ బాటలో నడుచుకోవాలి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారీమణి చాకలి (చిట్యాల) ఐలమ్మ 37వ వర్ధంతిని నారాయణఖేడ్‌లో నిర్వహించారు. ఖేడ్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ రుబీనానజీబ్ పూలమాలలు వేసి నివాళులు అరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం మొదట రజాకార్లతో పోరాడిన ధీరవణిత ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ బుజ్జీ, మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న అభిషేక్ శెట్కార్, సాయిరాం, రజక సంఘం నాయకులు సాయిలు, రాజు, అశోక్,తదితరులు ఉన్నారు.

### సిర్గాపూర్‌లో..

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో తెలంగాణ సాయుద పోరాట యేదురాలు వీరనారీమణి చాకలి ఐలమ్మ వర్ధంతిని శనివారం జరుపుకున్నారు. శనివారం మండల కేంద్రమైన సిర్గాపూర్ పట్టణంలో తెరాస మండల పార్టీ అధ్యక్షులు సంజీవరావు తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అరిపించారు. సిర్గాపూర్ గ్రామ తెరాస పార్టీ అధ్యక్షులు యాదవరావు పాటిల్, రజక సంఘం అధ్యక్షులు అంజయ్య, సిర్గాపూర్ మండల యూత్ అధ్యక్షులు రాజాగౌడ్, శివకుమార్, గొల్ల సాయిలు, కండక్టర్ భూమన్న, అంబాదాస్, రాములు, అశోక్, విజయ్, కృష్ణ, రాములునాయక్, పండరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి

### -కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు

**గజ్వేల్, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):**

అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం కెసిఆర్ గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయారన్నారు. గత ఆరు సంవత్సరాల క్రితం గజ్వేల్ పట్టణ శివారులోని సంగాపూర్, ముట్రాజ్‌పల్లి ప్రాంతంలో గజ్వేల్ పట్టణంలో ఉన్న నిరుపేదల కోసం 1250 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఏళ్ళు గడుస్తున్నా లబ్దిదారులకు అందించకపోవడం సిగ్గుచేటన్నారు. లబ్దిదారులకు అందించకుండానే డబుల్ బెడ్‌రూం ఇళ్ళు బీటలువారుతున్నాయన్నారు. మొదటిసారి ముఖ్యమంత్రిగా కెసిఆర్ కాగానే గజ్వేల్‌లో ఇళ్ళులేని నిరుపేదలు ఉండవద్దని బహిరంగ సభ సాక్షిగా హామీ ఇచ్చి ఎనిమిది సంవత్సరాలు గడిచిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్ళు మంజూరు చేయాలని, ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్దిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నా సిఎం కెసిఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్‌లు దృష్టి పెట్టకపోవడం ఏమిటన్నారు. సిఎం కెసిఆర్ ఇప్పటికైనా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్ళు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎండి.వాహిద్‌ఖాన్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హనుమాండ్ల నాగరాజు, పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షుడు క్యాసారం సయ్యద్ బాబు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఈదిగాని శివులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివారెడ్డి, గుండు లక్ష్మణ్, క్యాసారం మల్లారెడ్డి, సుధీర్, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

### సాంబశివరావును సన్మానించిన మండల నాయకులు

**మొయినాబాద్ సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభ ల్లో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మర్యాదపూర్వకంగా హైద్రాబాద్‌లోని సిపిఐ కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా మొయినాబాద్ మండల సిపిఐ నాయకులు సన్మానించడం జరిగింది, మండల నాయకులు మాట్లాడుతూ సాంబశివరావు అన్న రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం మాకు ఎంతో సంతోషంఉందన్నారు, ఆయన ఆధ్వర్యంలో పార్టీ భవిష్యత్ కోసం పనిచేస్తామని ఆయన మాట జవదాటకుండా పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని అన్నారు.

## ఐలమ్మ మహిళా లోకానికి స్ఫూర్తి

### జిల్లా రజక సంఘం అధ్యక్షులు సంగు స్వామి

**నిజాంపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** భూమి కోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం రాజకర్లపై పోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మను ప్రజాలు మరచిపోరాని జిల్లా రజక సంఘం అధ్యక్షులు సంగు స్వామి అన్నారు. శనివారం నాడు మండల కేంద్రములోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దేశెట్టి సిద్ద రాములు, సర్పంచ్ గేరు గంటి అనూష హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోరాటం సాగించి మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిరన్నారు. అదే స్ఫూర్తితో ఆనాడు మహిళలు, శ్రామికులు, గ్రామీణ పేదలు, రైతులు పెద్ద ఎత్తున రాజకర్లను ఎదిరించి దొరల గాడిలను ముట్టడించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఐలమ్మ పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ ప్రతి ఒక్కరు ఆమె అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు అమర్‌సేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు బాల్‌రెడ్డి, నగరం సర్పంచ్ గేమ్‌సింగ్, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌసన, నందిగామ ఎంపీటీసీ లద్ధ సురేష్, నిజాంపేట పిఏసిఎస్ చైర్మన్ బాపురెడ్డి, మండల యువజన అధ్యక్షులు మావురం రాజు, టీఆర్ఎస్ నాయకులు బి సంపత్, పి కిష్టారెడ్డి, కొమ్మట సత్యానారాయణ, వై వెంకటేశం, దయాకర్, అబ్దుల్ అజీజ్, లక్ష్మణ్ గౌడ్, రాజగోపాల్, నాగరాజు, అబ్దుల్ పాషా, లక్ష్మీ నర్సింలు, రామా గౌడ్, ఆకుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లాదుర్గంలో ..

**అల్లాదుర్గం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిచెప్పి మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఘనంగా జరుపుకున్నారు. అల్లాదుర్గంలోని రజకసంఘం నాయకులు శనివారం నాడు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజకసంఘం నాయకులు కర్రెల్ల బేతయ్య మాట్లాడుతూ భూమికోసం, భూక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియడారు. ఆమె స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని మహిళలు ఇంటికే పరిమితం కాకుండా ఉన్నత ఉద్యోగాలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, మల్లేశం, పరుశురాం, బేతయ్య, శ్రీనివాస్, సదానందం, ఈశ్వర్, నరేష్ తదితరులు ఉన్నారు.

### రామాయంపేటలో..

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిగా నిలిచిందని, ఐలమ్మ పోరాటం నేటి ఉద్యమాలకు ఆదర్శం అని రామాయంపేట మండల రజక సంఘం అధ్యక్షుడు కోనాపురం వెంకటి (వైఎస్) అన్నారు. శనివారం నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని పురస్కరించుకొని మండల రజక సంఘం ఆధ్వర్యంలో సభ్యులందరూ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యక్షుడు పరుపుగల్ల రాజు, కోశాధికారి మద్దూరి సత్యం, సభ్యులు చంద్రం, బాలరాజు, గంగయ్య, సత్యం, రాములు, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కోనాపూర్‌లో...

మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో గ్రామ రజక సంఘం ఆద్వర్యంలో చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని సంఘం సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మామిడి సిద్దరాములు, రజక సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, కార్యదర్శి సతీష్, రవీందర్, సత్యంతో పాటు రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### కాట్రియాలలో...

మండల పరిధిలోని కాట్రియాల గ్రామంలో గ్రామ రజక సంఘం ఆద్వర్యంలో చాకలి ఐలమ్మ 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు శ్యాములు, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి శివకుమార్, మైలారం బిక్షపతి, మైలారం భూమయ్య, బాలచంద్రన్, స్వామి, పెంటయ్య, మల్లయ్య, రాకేష్, సాయిలుతోపాటు రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ చిరస్మరణీయురాలు

### -మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి

**గజ్వేల్, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో రజక సంఘం భవనం వద్ద ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దైర్యసాహసాలతో తనదైన శైలిలో పోరాటం చేశారన్నారు. భూస్వాముల మెడలు వంచి పేద ప్రజలకు అండగా నిలిచిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బొగ్గుల చందు, పొన్నాల కుమార్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, మండల అధ్యక్షుడు శివరాజయ్య, పట్టణ అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు నర్సింలు, మల్లేశం, బాలయ్య, ఎర్రవాడ వెంకట్, జూపల్లి శ్యామ్, బాలకిషన్, బాకి స్వామి, రాజయ్య, రాములు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మాల మహానాడు ఆధ్వర్యంలో...

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ భవనం వద్ద ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివరాజయ్య, రాములు, నర్సింలు, మల్లేశం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రజ్ఞాపూర్‌లో...

తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ప్రజ్ఞాపూర్‌లో రజక సంఘం అధ్యక్షుడు టెంట్‌హౌజ్ మెతుకు నర్సింలు ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తనదైన శైలిలో పోరాటం చేశారన్నారు. భూస్వాముల పెత్తనాన్ని అణిచివేసిన గొప్ప మహిళ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాపూర్ రజక సంఘం నాయకులు బాలమల్లు, మెతుకు శ్రీనివాస్, డ్రైవర్ రాములు, మెతుకు సాయిబాబా, మెతుకు బాలకిషన్, చిట్టాపురం దుర్గయ్య, మెతుకు కర్ణాకర్, నర్సింలు, తిరుపతి, మెతుకు దశరథ, బాలయ్య, ఇస్తారి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షం.. నిండిన చెరువులు, కుంటలు

**అల్లాదుర్గం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండంలోని చెరువులు, కుంటల అలుగులు పారుతున్నాయి. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో వరద ఉధృతి బాగా పెరగడంతో చెరువులు, కుంటల అలుగులు పొంగిపోర్లుతున్నాయి. ఇంతె కాకుండా చెరువులోకి నీరు అధికంగా ప్రవహించడంతో రోడ్లు ఇక్కడ చూసిన నీటితో నిండిపోయాయి. అల్లాదుర్గం శివారులోని కోమటికుంట చెరువులో నీరు అధికంగా రావడంతో ఈ నీరు బట్టికుంట చెరువులోకి ప్రవహించడంతో ఈ చెరువునుండి సమీపంలోని బాలుర హస్టల్ ముందు నుండి పొంగిపోర్లాయి. ఇంతే కాకుండా అల్లాదుర్గం నుండి మెయిన్‌రోడ్డుకు పోయే బీటిరోడ్డుపైనుండి వరద నీరు పారడంతో సుమారు మూడు నాలుగు గంటలపాటు రోడ్డుపై పోయే వాహనాలు ఎక్కడికక్కడే స్థంభించిపోయాయి. చాల సంవత్సరాల తరువాత ఇలాంటి భారీ వర్షం కురవడం ఇదే మొదటిసారి అని స్థానికులు తెలుపుతున్నారు. ఈ వరద వల్ల అల్లాదుర్గం శివారులోని పెద్దపటేల్ చెరువు నిండి అలుగు పారుతున్నాయి. ఈ భారీ వర్షాల వల్ల బట్టికుంట చెరువు అలుగు పొంగి ప్రవహించడంతో కింద ఉన్న వరిపంట పోలాలు నీటిలో కొట్టుకుపోయి రైతులకు భారీనష్టం సంభవించినట్లు రైతులు తెలిపారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కురుస్తున్న వర్షం వల్ల పాత ఇండ్లు పాక్షికంగా కొన్ని పూర్తిగా కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు.

### టేక్మాల్‌లో..

**టేక్మాల్,సెప్టెంబరు 10,ప్రభాతవార్త:**

శనివారం టేక్మాల్ మండలంలో భారీగా కురిసిన వర్షానికి తడిసి ముద్దయింది. దీంతో పాటు వాగులు వంకలు పొంగి పొర్లినాయి. టేక్మాల్ మీదుగా జోగిపేట్ వేళ్లే రహదారిని గుండు వాగు పూర్తిగా కమ్మేసింది. రాక పోకలు బంద్ చేశారు. ఎవరు గుండు వాగు మీదుగా ప్రయాణం చేసే సహసం చేయవద్దని పోలీసులు హెచ్చరించారు. ఎల్లుపేట గ్రామానికి కొందరు కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం వచ్చి వాగు అవతలి భాగంలో ఇరుక్కు పోయారు. గ్రామస్తులు చాకచక్యంగా వ్యవహరించి కూలీలను వాగు ఇవతలి వైపుకు తరలించారు. బొడ్మట్‌పల్లి గ్రామం మీదుగా ప్రవహిస్తున్న గుండు వాగును కొందరు రియాల్ ఎస్టేట్ వ్యాపారులు వాగుకు అడ్డంగా మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షం అధికంగా కురువడంతో గుండు వాగు నీరంత వేళ్లే దారి పూర్తిగా కప్పడంతో సమిపంలో ఉన్న సుమారు 20 ఎకరాల పంట పోలాలు పూర్తిగా నీట ముగినిగింది. దీంతో రైతులు లబోదిబోమంటూ విలపించారు. తంప్లూర్ గ్రామంలో వర్షం నీరంత ఇళ్లలోకి చేరింది దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకున్నారు. వర్షాల కారణంగా ఎవరు బయటకు వెళ్లకుడదన్నారు.

## తెలంగాణలో ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు

**ఆమనగల్లు, సెప్టెంబర్10, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం తెరాస సర్కారు దేశంలో ఎక్కడా అమలు కానీ పథకాలను అమలు చేస్తుందని ఆయన కొనియాడారు. మండల పరిధి లోని పోలెపల్లి గ్రామానికి చెందిన భగవాన్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం తన నివాసంలో అందజేశారు. అనంతరం టిఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై ప్రశంసల జల్లు కురిపించారు. తెరాస సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి భావజాలాలకు చోటు లేకుండా పార్టీలకతీతంగా అర్హులైన అందరికి అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి పనితీరుతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు.

## ఆర్టీసీని ప్రోత్సహించండి

**కొందుర్గు, సెప్టెంబర్ 10, (ప్రభాతవార్త) :**

ప్రయాణీకులు రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ బస్సులోనే ప్రయాణించుటకు ప్రోత్స హించాలని షాద్‌నగర్ డిపో మేనేజర్ సురేఖ కోరారు. ప్రజల వద్దకు ఆర్టీసీ అనే కార్యక్రమంలో భాగంగా కొందుర్గు బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యం కోసమే ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను నడుపుతుందని ప్రజలందరూ వీధిగా బస్సులోనే ప్రయాణించి ఆర్టీసీ సంస్థ పురోగతికి సహకరించాలని మేనేజర్ కోరారు. కొందుర్గు నుంచి నవాబుపేట్‌కు వెళ్లే బస్సులను గంగన్నగూడెం మీదుగా వెళ్లాలని గంగన్నగూడెం గ్రామస్తులు గొల్ల శేఖర్, గోపాల్‌రెడ్డిలు డిపో మేనేజర్‌ను కోరారు. పర్వతాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన దర్గా వెంకటేష్ కోరారు. లాలాపేట గ్రామానికి మధ్యాహ్నం వేళ బస్సు నడపాలని కమ్మరి రాములు అనే ప్రయాణీకుడు కోరారు. అలాగే బస్టాండ్ వెనుకాల ప్రారంభించిన మరుగుదొడ్లను వాడుకునేందుకు నీటి సౌకర్యం కల్పించాలని, పార్కింగ్ పాయింట్ ఏర్పాటు చేసి కంట్రోలర్‌ను నియించి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చూడాలని కొందుర్గు మాజీ ఎంపీటీసీ కావాలి యాదయ్య, మాజీ సర్పంచి బి.వెంకటయ్య, జర్నలిస్టు కృష్ణయ్యగౌడ్ , నాయకులు జిల్లెళ్ల ప్రభుదాసు, భీమారం మారయ్య, రాయికంటి రామస్వామి, సత్యనారాయణ, అంజయ్య తదితరులు మేనేజర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె వెటనే మరుగుదొడ్లను బస్టాండ్‌ను పరిశీలించారు. సమస్యలు న్నంటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తాని చెప్పారు. ఈ సమావే శంలో అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు, సిబ్బంది, బూషన్, అర్జున్‌కుమార్, వెంకటేష్, వెంకటయ్య, విధ పార్టీల నాయకులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యం

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

ఆసుపత్రుల్లో 24 గంటల పాటు కాన్పులు జరిపించేందుకు సిబ్బంది సహాయక చర్యల్లో ఉండాలని మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని జిల్లా ఆసుపత్రిలో శనివారం ఆయన వైద్య సేవలపై వైద్యులు, సిబ్బంతితో సమన్వయ సమావేశం జరిపారు. రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు డిఎంహెచ్‌ఓ పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. మాతా ఆరోగ్య సేవల బలోపేతం, సిబ్బంది హేతుబద్దీకరణపై ఆయన సమీక్షించారు. 24/7 సిహెచ్‌సీ, ఎహెచ్‌సీలలో కాన్పులు నిర్వహించడానికి ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు సహాయక చర్యలల్లో ఉండాలని స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లాలో సి-సెక్షన్‌లను ఎలాగైనా తగ్గించాలని మంత్రి హరీష్‌రావు ఆదేశించారని, గైనకాలజిస్ట్, అనస్థీషియా, వైద్యులకు, అవాంఛనీయ సిజేరియన్‌ల ను తగ్గించడం, ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. గర్భిణీస్త్రీలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కృషి చేయాలని, యువతులు సాధారణ ప్రసవాలపై మొగ్గు చూపేలా నవల నొప్పిలేకుండా ప్రసవాలు చేసే విధానాలను అన్వేషించాలని సిబ్బందిని కోరారు. ప్రసవించిన తొలి గంటలలో తల్లి పాలు గోల్డెన్ అవర్ అని ఈసమయంలో తల్లి, అప్పుడే పుట్టిన బిడ్డ ఇద్దరి ఆరోగ్యాన్ని కాపాడుతుందని, వ్యాక్సిన్ పనిచేస్తుందని ఆరోగ్యాన్ని ఎక్కుం కాలం కాపాడుతుందని పేర్కొన్నారు. సాధారణ ప్రసవాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణంలో ఎఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈసమావేశంలో జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్త (డిసిహెచ్‌ఎస్) డాక్టర్ కోట్యానాయక్, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ నారాయణరావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## రెండు లక్షల 55వేల 555రూపాయలు పలికిన మధురానగర్ లడ్డు

**శంషాబాద్ సెప్టెంబర్10,ప్రభాతవార్త :**

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని మధురానగర్ వీధి నెంబర్ 15లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుని లడ్డూను సాతం రాయి గ్రామానికి చెందిన వి.నాగరాజు యాదవ్ 2లక్షల 55వేల 555రూ పాయలకు సొంతం చేసుకున్నారు.ఇదే వినాయక మండపంలోని చిన్న లడ్డును మధురానగర్‌కు చెందిన దండు నిహాల్ ఒక లక్ష నలభై వేల రూపాయలకు వేలం పాటలో సొంతం చేసుకున్నారు.తొమ్మిది రాత్రులు గణేశునికి పూజలు నిర్వహించి అన్నదానం చేసిన అనంతరం వినాయక నిమజ్జనాన్ని చేశారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వట్టేల శ్రీరాములు యాదవ్,గణేష్,వీరేశం,ఈదుల నరసింహ గౌడ్,ప్రభాకర్,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎస్ఐ వెంకటేష్

**తలకొండపల్లి సెప్టెంబర్10,ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండలంలోని దేవుని పడకల్ గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం స్థానిక ఎస్ఐ వెంకటేష్ దర్శించుకున్నారు.అనంతరం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడిని దర్శించుకున్నారు. గ్రామంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు.ప్రజలకు ఏలాంటి అవరోధం ఏర్పడకుండా నిమజ్జనం పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీశైలం ,మాజీ సర్పంచ్ శంకర్,మాజీ ఎంపిటిసి రవి,లక్ష్మయ్య, శంకర్, మల్లేష్, రమేష్,స్వామి,తదితరులు పాల్గొన్నారు.

## మహా గణపతి పూజలో శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి సెప్టెంబర్10,ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండల పరిధిలోని శీకుమంతల గ్రామంలో మహా గణపతి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ,ఎస్ఐ వెంకటేష్,టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం మాజీ సర్పంచ్ టిఆర్ ఎస్ గ్రామ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం లో పాల్గొని అన్నదానం చేశారు.